కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


మోతెలో ప్రారంభిస్తున్న ఏపీడీ మధుసూదన్, తహసీల్దార్ నాగార్జున


రాయకూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ వెంకటేశం

రుద్రూర్: రుద్రూర్ మండలం రాయకూర్ సింగిల్ విండో పరిధిలోని రాణంపల్లి, రాయకూర్, చిక్కడపల్లి గ్రామాల్లో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ వెంకటేశం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి శ్రావణి, విండో కార్యదర్శి గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

కోటగిరిలో...

కోటగిరిలో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ప్రభాకర్ ప్రారంభించారు. కోనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడు ధాన్యం రూ.2203, బీ గ్రేడు ధాన్యం కు రూ. 2183 మద్దతు ధర చెల్లిస్తారని అన్నారు. వ్యవసాయాధికారి శ్రీనివాస్ రావు ఉన్నారు.

నందిపేట్: నందిపేట్ మండలంలో శుక్రవారం ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగొలు కేంద్రాలను సంఘ కార్యదర్శి నరహరి ప్రారంభించారు. అయిలాపూర్, కంఠం, నందిపేట్, వెల్మల్, ఆంధ్రానగర్ గ్రామాల్లో కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఇంకా రైస్ మిల్లుల కేటాయింపు జరగలేదని, త్వరలో అనుమతి వస్తుందని ఈ లోగా తేమ శాతం గుర్తించి కుప్పలు చేయిస్తామన్నారు. రైతులు వడ్లను ఆరబెట్టి సంఘ సిబ్బందికి సహకరించాలని కోరారు. సంఘ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వేల్పూర్: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ మధుసూదన్, వేల్పూర్ తహసీల్దార్ నాగార్జున సూచించారు. వేల్పూర్ మండలం మోతెలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన రైసుమిల్లుకు పంపాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ఎంపీడీవో కమలాకర్‌రావు, డీపీఎం సాయిలు, సీసీ ఏడెల్లి రవి పాల్గొన్నారు.

అక్కడ అమలు చేసి ఓట్లు అడగాలి

• మంత్రి ప్రశాంత్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ: కాంగ్రెస్, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణలో చేపడుతున్న సంక్షేమ పథకాలను అమలు చేసి ఇక్కడ ఓట్లు అడగలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ముప్కాల్‌లో, మెండోరా మండలం పోచంపాడ్ కూడలీ వద్ద గల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో, ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రైతు బంధు, రూ.రెండు వేల పింఛన్ అందడం లేదన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సీఎం కేసీఆర్ నాయకత్వంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యకర్తలు అభివృద్ధి పనులను చూపి ఓటు అడగలన్నారు. ప్రజలు ఆలోచన చేసి బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని కోరారు.

అభివృద్ధికి మారుపేరు తెలంగాణ

తెలంగాణ అభివృద్ధికి మారు పేరుగా మారిందని మాజీ స్పీకర్, రాజ్యసభ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి అన్నారు. 1995లో ఓ ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే ఎంతో ఇబ్బంది ఉండేదన్నారు. ప్రస్తుతం ఊరికో సబ్‌స్టేషన్‌ను నిర్మించినట్లు చెప్పారు. డాక్టర్ మధుశేఖర్, కోటాపాటి నరసింహనాయుడు, ఎంపీపీలు సామ పద్మ, సుకన్య, జెడ్పీటీసీలు బద్దం నర్సవ్వ, తలారి గంగాధర్, వైస్ ఎంపీపీలు ఆకుల చిన్నరాజన్న, సరస్వతి, నాయకులు ముస్కు భూమేశ్వర్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

వేల్పూర్: మోర్తాడ్‌కు చెందిన దూదేకుల సంఘం సభ్యులు శుక్రవారం వేల్పూర్‌లో మంత్రి ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. దూదేకుల సంఘం సభ్యులు మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మద్దతు ప్రకటించారు. మోర్తాడ్ ఎంపీపీ శివలింగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వర్క్‌షాప్‌కు ఎంపిక



పెర్కిట్: ఇంటింట ఇన్నోవేటర్ కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని సాయి చరణి టీఎస్ వర్క్‌షాప్‌కు ఎంపికైంది. పాఠశాల గైడ్ టీచర్ రఘునాథ్ ఆధ్వర్యంలో ఆమె రూపొందించిన కరెంటు లేకుండా బ్రిక్స్ లిఫ్టింగ్ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ప్రాజెక్టును మరింత అభివృద్ధి చేయడానికి అధికారులు టీఎస్ వర్క్ షాప్‌కు ఎంపిక చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం నారాయణ తెలిపారు. గైడ్ టీచర్ రఘునాథ్, విద్యార్థిని సాయిచరణిని హెచ్‌ఎం అభినందించారు.

బీబీఏ కోర్సుపై అవగాహన



ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు బీబీఏ కోర్సును అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కళాశాలల విద్యా సంచాలక కార్యాలయం జాయింట్ డైరెక్టర్ రాజేంద్రసింగ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని విజేత డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం బీబీఏ కోర్సు గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీబీఏ కోర్సు అభ్యసించిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అనంతరం రాజేందర్‌ను కళాశాల కరస్పాండెంట్ సంజీవ్‌రెడ్డి సత్కారించారు. ప్రిన్సిపాల్ ఆనంద్, వైస్ ప్రిన్సిపాల్ అశోక్, లలిత అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యారంగంపై చిన్నచూపు



ఆర్మూర్: రాష్ట్ర ప్రభుత్వం విద్యరంగాన్ని పూర్తిగా విస్మరించిందని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆజాద్ అన్నారు. ఆర్మూర్‌లోని కుమార్ నారాయణ భవన్‌లో ఆర్మూర్ డివిజన్ పరిధిలోని పీడీఎస్‌యూ నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులను, విద్యార్థులకు మోసం చేసిన పార్టీలను నిలదీయాలన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. మేనిఫెస్టోలో ఉద్యోగాల ఊసేలేదన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్, సహాయ కార్యదర్శులు దుర్గా ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పోటీపై త్వరలో నిర్ణయం




నవీపేట: ఎమ్మెల్యేగా పోటీ చేసే నిర్ణయాన్ని త్వరలో ప్రకటిస్తానని పెంటాకుర్దు సొసైటీ చైర్మన్ అమర్‌నాథ్‌బాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై బోధన్, నిజామాబాద్‌లలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు. నిజాంసాగర్ చివరి ఆయకట్టు విస్తీర్ణం పెంపు, బోధన్‌లోని ఎన్‌ఎస్‌ఎఫ్ పునరుద్ధరణపై స్పష్టమైన హామీ ఇవ్వకపోతే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని పేర్కొన్నారు. ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి జీవితాంతం కృషి చేశానని పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

మాక్లూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మదనపల్లిలో ఆయన మాట్లాడారు. వరి కోతలు ప్రారంభమై 20 రోజులైంది అన్నారు. ధాన్యం ఎక్కడికక్కడ పేరుకు పోయిందన్నారు. పెంటపాడు పోతున్న, వేణు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల ఆంజనేయ ఆలయంలో గల దుర్గామాతకు ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సతీమణి రజితరెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, కౌన్సిలర్ ఖాందేష్ వరలక్ష్మి పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుడిగా అండగా ఉంటా


దుర్గానగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

మాక్లూర్: కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపిస్తే కుటుంబంలో ఒకడిగా అండగా ఉంటానని ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దుర్గానగర్, సింగంపల్లి తండాల్లో జీవన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. తండాలను జీపీలుగా మార్చి ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మి ఓట్లు వేస్తే మళ్లీ 20 ఏళ్లు వెనక్కి వెళ్లాల్సి వస్తుందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుంటే గిట్టని కొందరు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వారి మాటలను నమ్మవద్దన్నారు. ఎంపీపీ మాస్త ప్రభాకర్, బడుగు సత్యం, ఆకుల రజనీష్, ఎనుగంటి శ్రీనివాస్‌గౌడ్, బూరోల్ల అశోక్, గుగ్గిలం రాజేశ్వర్‌గౌడ్, కోకా హైమద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీల మాటలతో మోసపోవద్దు

పెర్కిట్: అభివృద్ధి నిరోధకాలు అయిన కాంగ్రెస్, బీజేపీల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం చేపూర్‌లో శుక్రవారం ప్రజా ఆశీర్వాద యాత్రలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలననే తెలంగాణకు శ్రీరామ రక్ష అన్నారు. సీఎం కేసీఆర్ రైతులకు 24 గంటల కరెంటు ఇస్తుంటే కాంగ్రెస్ నాలుగు గంటలు చాలని, బీజేపీ మోటర్లకు మీటర్లు బిగించాలని రైతులను ఆందోళనలకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. ఆర్మూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన తనను గెలిపించాలని కోరారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎల్ఎంబీ రాజేశ్వర్, సర్పంచ్ ఇందూర్ సాయన్న, ఎంపీటీసీ బాల నర్సయ, జన్నెపల్లి గంగాధర్ పాల్గొన్నారు.

ఒక్కసారి దీవించండి


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వినయ్‌రెడ్డి

మాక్లూర్: ఒక్కసారి దీవించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే జీవితాంతం రుణపడి ఉంటానని ఆర్మూర్ కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరు వినయ్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం డీకంపల్లి, కళ్యాణి గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ప్రజా సేవే లక్ష్యంగా రాజకీయాల్లోనికి వచ్చానని చెప్పారు. ఈ సందర్భంగా కొందరు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. డేగ పోశెట్టి, గంగాధర్ గౌడ్, ఎడ్ల పోశెట్టి, రవి ప్రకాష్, వెంకటేశ్వరరావు, జైల్ సింగ్, రవి పాల్గొన్నారు.

పెర్కిట్: ఆర్మూర్ మండలం గగ్గుపల్లి, ఇస్సాపల్లి గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి వినయ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ రెడ్డి ఇంటింటికి తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను, విస్మరించిన ఎన్నికల హామీలను ప్రజలకు గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రకటించిన ఆరు వాగ్దానాలను వెంటనే అమలు చేస్తామన్నారు. విట్టం జీవన్, ముక్కెర విజయ్ పాల్గొన్నారు.

సొంత బిడ్డల్లా కాపాడుకుంటా


మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

భీమ్‌గల్: బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల్లా తాను స్వార్థ రాజకీయాలు చేయనని, బాల్కొండ ప్రజలను సొంత బిడ్డల్లా కాపాడుకుంటానని బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ అన్నారు. మండలంలోని బడా భీమ్‌గల్, చేంగల్ గ్రామాల్లో శుక్రవారం ఆమె ప్రచారం నిర్వహించారు. అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ మంత్రి ప్రశాంత్‌రెడ్డి అండ దండలతో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు భీమ్‌గల్ మండలాన్ని గంజాయి మయం చేసి యువత జీవితాలను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. పసుపు బోర్డు తీసుకొచ్చి ఎంపీ అర్వింద్ మాట నిలబెట్టుకున్నారని చెప్పారు. బీజేపీకి ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. మారంపల్లి గంగాధర్, మల్కాన్నగారి మోహన్, మహిపాల్, యోగేశ్వర్ నర్సయ్య, కిషన్, మోహన్, భూమన్న, సుజీత్, దినేష్, నికేష్, వెంకట్ గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్‌పల్లిలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ సమక్షంలో మోర్తాడ్ మండలం తిమ్మాపూర్, గాండ్లపేట గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు 150 మంది బీజేపీలో చేరారు. తిమ్మాపూర్ రైతు సమన్వయ సమితి చైర్మన్ గోపిడి గంగారెడ్డి, ఇతర నాయకులు బీజేపీలో చేరగా వారిని అన్నపూర్ణమ్మ పార్టీలోకి ఆహ్వానించారు. ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, పుప్పాల నరేష్, ఏలేటి సాయన్న, బద్ద లింగారెడ్డి, జైపాల్ రెడ్డి, మోతె లింగన్న, చిన్న రాజన్న పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

బోధన్‌లో ఎమ్మెల్యే సతీమణి



బోధన్‌టౌన్: పట్టణంలోని రాకాసీపేట్ కాలనీలో ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతీమా శుక్రవారం ప్రచారం చేశారు. ప్రతీ ఇంటికి తిరుగుతూ బీఆర్‌ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గురించి వివరించారు. ఎమ్మెల్యే షకీల్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

వేంపల్లిలో కాంగ్రెస్



బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లిలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. రాజకుమార్, ఎట్టం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాబాపూర్‌లో

భీమ్‌గల్: మండలంలోని బాబాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. రాడె మురళి, కిష్టి చిన్నారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటగిరిలో..

కోటగిరి(రుద్రూర్): కోటగిరిలో శుక్రవారం కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చేపట్టబోయే ఆరు గ్యారెంటీ పథకాలను వివరించారు. కొట్టం మనోహర్, షాహిద్ ఉన్నారు.

గోవూరులో బీఆర్‌ఎస్..



వర్ని(మోస్రా): మండలంలోని గోవూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్ రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి సురేందర్ రెడ్డి, పిట్ల శ్రీరాములు, హనుమంత్ రెడ్డి, ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ కాంగ్రెస్‌లో భారీ చేరికలు


కాంగ్రెస్ పార్టీలో చేరిన డీసీసీబీ మాజీ చైర్మన్, మున్సిపల్ మాజీ చైర్మన్

బోధన్‌టౌన్: డీసీసీబీ మాజీ చైర్మన్ గంగాధర్‌రావు పట్వారీ, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంపల్లి ఎల్లమయ్య, 21వ వార్డు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ హమెద్, బొగ్గుల ప్రభాకర్, రాజాగౌడ్, 300 మంది యువకులు శుక్రవారం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వారికి వారికి మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రాకాసీపేట్‌లో నిర్వహించిన చేరికల సభలో మాట్లాడారు. తెలంగాణకు బీఆర్‌ఎస్ చేసింది ఏమి లేదన్నారు. నిజాం చక్కర కర్మాగారాన్ని అధికారంలోకి వచ్చిన అనంతరం మూసి వేశారని, నియోజకవర్గంలో నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని విమర్శించారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ, మైనార్టీల రిజర్వేషన్ గురించి సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే షకీల్ ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి, కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ అల్లె లావణ్య, తాహేర్‌బిన్ హందాన్, పాషా మోయినొద్దీన్, హరికాంత్ చారీ పాల్గొన్నారు.

తండాలను అభివృద్ధి చేస్తా


అయిలాపూర్‌లో ప్రచారంలో పాల్గొన్న రాకేశ్‌రెడ్డి

మాక్లూర్: తనను గెలిపిస్తే తండాలను అభివృద్ధి చేసి చూపిస్తానని ఆర్మూర్ బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం మండలంలోని మదన్‌పల్లి, సట్లాపూర్ తండాల్లో రాకేశ్‌రెడ్డి ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ బంగారు తెలంగాణ పేరుతో తండాలను జీపీలుగా మార్చినా అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నాయన్నారు. నిధులు సరిపోక వసతులు కల్పించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు గెలిపించిన వ్యక్తి స్వప్రయోజనాలు ఆశించి మాత్రమే పని చేశారన్నారు. గూండా రాజకీయాలను పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. పార్టీ మండలాధ్యక్షుడు సురేష్‌నాయక్, గంగోనే సంతోష్, పాలేపు రాజు, చిన్నాపూర్ వినోద్, శివలాల్, చింత ప్రవీణ్ పాల్గొన్నారు.

నందిపేట్: నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడానికి తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఆర్మూర్ బీజేపీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి అన్నారు. నందిపేట మండలంలోని అయిలాపూర్‌లో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తనను గెలిపిస్తే పేదలందరికీ ఇళ్లు, అర్హులందరికి పెన్షన్లు వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు.

ప్రతిపక్షాలు గల్లంతవడం ఖాయం

• బోధన్ ఎమ్మెల్యే షకీల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే షకీల్

రెంజల్: బీఆర్‌ఎస్ ప్రభంజనంలో ప్రతిపక్ష పార్టీలు గల్లంతవడం ఖాయమని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ అన్నారు. మండలంలోని సాటాపూర్‌లో గల ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డికి వయసు పెరగడంతో మతిలేని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. తాను రైస్ మిల్లు ద్వారా కుంభకోణం చేసినట్లు ఆరోపిస్తున్నారని, వాటికి సంబంధించిన ఆధారాలు నిరూపిస్తే ఏ త్యాగానికైనా సిద్ధమేనని సవాల్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎఖార్‌పాషా, మర్ల రమేశ్‌కుమార్, ఖలీంబేగ్, సాయిలు, జాదవ్ గణేశ్, హైమద్‌బేగ్, అసద్‌బేగ్, ఇమాంబేగ్, మొయినొద్దీన్, భూంరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాధనం లూటీ చేసిన వారికి బుద్ధి చెప్పాలి


తొర్తిలో ప్రచారం నిర్వహిస్తున్న సునీల్‌రెడ్డి

మోర్తాడ్: బాల్కొండ నియోజకవర్గంలో ప్రజాధనం లూటీ చేసిన మంత్రి ప్రశాంత్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఏర్గట్ల మండలం తొర్తి, తాళ్లరాంపూర్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సహజవనరులను దోపిడికి గురి చేసి దోచుకున్న సొమ్ముతోనే ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2లక్షల రుణాల మాఫీ చేస్తుందని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌లో చేరిక

భీమ్‌గల్/కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి, భీమ్‌గల్ మండలం కారేపల్లికి చెందిన పలువురు శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. అదే విధంగా నియోజకవర్గం పరిధిలోని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాలలోని తండాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కష్టపడి పనిచేసి కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలని ఆయన కోరారు. సుంకెట రవి, జలపతి, గణేష్, రవీందర్, నరేష్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

సెల్‌ఫోన్ అందజేత

బోధన్‌టౌన్: ఆర్టీసీ బస్‌లో ఫోన్ పోగొట్టుకున్న యువకుడికి డిపోలో విధులు నిర్వహిస్తున్న ఏడీసీ బీఏ రాణి తిరిగి అందించారు. పట్టణానికి చెందిన శుభం నిజామాబాద్‌లోని విద్యాశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం నిజామాబాద్‌కు బస్సులో వెళ్తుండగా ఫోన్ మార్చిపోయాడు. గమనించిన ఏడీసీ రాణి దానిని యువకుడికి తిరిగి అందజేసింది.

విద్యార్థులకు స్కూల్ కిట్స్..

పెర్కిట్: ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్కూల్ కిట్స్ అందజేశారు. సంస్థ ప్రతినిధి రోజా మాట్లాడుతూ గ్రామాల్లోని పాఠశాలల అభివృద్ధికి సంస్థ కృషి చేస్తుందన్నారు. ఎంఈవో రాజ గంగారాం, సంస్థ సభ్యులు స్వరూప, హరీష్, ఉపాధ్యాయులు జగదీష్, శ్రీనివాస్, లింబాద్రి, కృష్ణా రెడ్డి, భాను ప్రకాష్, మాలతి తదితరులు పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

వేల్పూర్: మండలంలోని లక్కోర వద్ద ఏఎన్‌జీ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించే బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఆర్‌టీఏ సభ్యుడు రేగుల్ల రాములు కోరారు. శుక్రవారం వేల్పూర్‌లో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ బీమ జమున, ఎంపీటీసీ మొండి మహేశ్, ఉపసర్పంచ్ పిట్లసత్యం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు దివ్యాంగుల మద్దతు

నవీపేట: బీఆర్‌ఎస్ పార్టీ దివ్యాంగుల మద్దతు ఉందని బీఆర్‌ఎస్ మండల నాయకులు నర్సింగ్‌రావ్, ప్రవీన్‌కుమార్, తెడ్డు పోశెట్టిలు ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం దివ్యాంగులతో ప్రత్యేక సమావేశాని ఏర్పాటు చేశారు. దివ్యాంగుల అవస్థలను అర్థం చేసుకున్న సీఎం కేసీఆర్ పింఛన్‌ను రూ.నాలుగు వేలకు పెంచారన్నారు. బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇస్తున్నట్లు ఈ సందర్భంగా దివ్యాంగులు హామీ ఇచ్చారు. సూరిబాబు, మల్లేష్, జావిద్ పాల్గొన్నారు.

గంగపుత్ర సంఘం సభ్యులు..

మాక్లూర్: కల్లెడి గంగపుత్ర సభ్యులు ఆర్మూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జీవన్ రెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. శుక్రవారం వైస్ ఎంపీపీ సుక్కి సుజాత సుధాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాన్ని ప్రకటించారు. బాసెట్టి సుమలత, మనిషి గౌడ్, గుండ్ల సాయిలు, మల్లేష్, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం



రెంజల్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలనలో బోధన్ నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సాటాపూర్‌లో పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం వారు ప్రారంభించారు. మోదీ నాయకత్వంలో రాష్ట్రంలో బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తామిద్దరిని కాదని పార్టీ హైకమాండ్ మూడో వ్యక్తికి టికెట్ అందించినా గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు పనిచేయాలని సూచించారు. విభేదాలకు తావు లేకుండా కలిసికట్టుగా పార్టీని నియోజకవర్గంలో అధికారంలోకి తేవాలని సూచించారు. ఎంపీపీ లోలపు రజని, గోపీకృష్ణ, బుజ్జి, కిశోర్, సంతోష్, యోగేశ్, శ్రీనివాస్, పోచయ్య పాల్గొన్నారు.

బోధన్‌టౌన్: పట్టణంలోని రాకాసీపేట్‌లో బీజేపీ నాయకులు ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి కోరారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	లింగోచ్చా(తెలుగు) - 1.45, ఒక్కడే-1 (తెలుగు) - 4.45, మార్టిన్ లూథర్ కింగ్(తెలుగు) - 7.25, ఓటు (తెలుగు) - 10.30
స్క్రీన్-2 –	భగవంత్ కేసరి (తెలుగు) - 11.15, 2.40, 6.05, 9.30
స్క్రీన్-3 –	లియో (తెలుగు) - 11.55, 3.20, 6.45, 10.10
స్క్రీన్-4 –	మార్టిన్ లూథర్ కింగ్ (తెలుగు)-12.05, నాగేశ్వరరావు-3.10, 6.35, 10.00